వనం..మనం.. మనఊరి కోసం
RNI/APTEL/26/A3829
ప్రభ మనం
TELUGU DAILY
తెలుగు డైలీ
Gmail: prabhamanam@gmail.com

విలేకరులు కావలెను.
WANTED... WANTED...
ఆంధ్ర, తెలంగాణ నుండి వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక ప్రభ మనం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సి ఇంచార్జీలు,సిసి ఇంచార్జీలు మరియు మండల విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్: వి. లింగమూర్తి
9000367833, 8074937223

కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 52 | పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com ఆదివారం 09-08-2026

# సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు

- తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగకూడదు
- 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ లక్ష్యం
- పత్తిపాకతో 10 వేల ఎకరాలకు కొత్తగా సాగునీరు
- భూసేకరణ, టెండర్లు, అనుమతులు సమాంతరంగా చేపట్టాలి
- నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగవంతం చేయాలి
- ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే లక్ష్యం



సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు మంజూరు చేసినట్లు తెలంగాణ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భూసేకరణ, కోసం రూ.5 వేల కోట్లు మంజూరు చేశామని వెల్లడించారు. నిధుల కొరతతో సాగునీటి పనులు ఆగొద్దని చెప్పుకొచ్చారు. శనివారం సచివాలయంలో మీడియాతో మంత్రి ఉత్తమ్ మాట్లాడారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టం చేశారు. మిడ్‌మానేరు ఎడమ కాలువ పనులను వెంటనే పునఃప్రారంభిస్తామని వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌ను ఫాస్ట్‌ట్రాక్‌లో పూర్తి చేయాలని ఆదేశించారు. పత్తిపాకతో కొత్తగా 10 వేల ఎకరాలకు సాగునీరు ఇస్తామని పేర్కొన్నారు. 2.40 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణే లక్ష్యమని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. ఆగస్టు నెలాఖరులోగా పత్తిపాక డీపీఆర్ సిద్ధం చేస్తామని తెలిపారు. - మిగతా 2 లో



## తెలంగాణలో త్వరలో మద్యం ధరల పెంపు!

- ధరల సవరణపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన కమిటీ
- మూడేళ్ల తర్వాత ధరల పెంపునకు సిద్ధమైన సర్కార్
- 10 నుంచి 15 శాతం పెంపు కోరుతున్న మద్యం తయారీ సంస్థలు
- పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ రవాణాపై ప్రభుత్వం ఆందోళన

మద్యం ధరలు పెంచేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. బడ్జెట్, మిడ్-రేంజ్, ప్రీమియం సహా అన్ని రకాల - మిగతా 2 లో




## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ముఖ్యమంత్రి రేవంత్‌కు వ్యవసాయంపై అవగాహన శూన్యమన్న కేటీఆర్
- నీటి హక్కుల పరిరక్షణ కోసం మరో ఉద్యమానికి సిద్ధమన్న కేటీఆర్
- 24 గంటల కరెంటు ఇస్తున్నట్లు నిరూపించాలని సవాల్
- ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ తీవ్ర పోరాటం చేస్తుందని వెల్లడి

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్వహించినన్ని యాగాలు దేశంలో మరెవరూ చేసి ఉండరని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. శనివారం ఆయన మీడియాతో - మిగతా 2 లో

## సవాళ్లే అవకాశాలుగా మారుతాయి నేర్చుకునే వాడు గెలుస్తాడు



- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ
- ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ
- ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిష్టాత్మక పురస్కారాల ప్రదానం
- 'వికసిత్ భారత్' సాకారంలో యువతదే కీలక పాత్ర అని వ్యాఖ్య

ప్రపంచం, సాంకేతికత వేగంగా మారుతున్నాయని, ఎవరైతే నిరంతరం నేర్చుకుంటారో వారే విజయం సాధిస్తారని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. యువత నిత్య విద్యార్థుల్లాగా ఉంటూ, ఏదో ఒకటి తెలుసుకోవాలనే ఉత్సుకతను ఎల్లప్పుడూ సజీవంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. సవాళ్లను ఎదుర్కొనే ధైర్యం ఉన్నవారికి, అవే అవకాశాలుగా మారుతాయని పేర్కొన్నారు. భారత్ ప్రస్తుతం అన్ని రంగాల్లో స్వయం సమృద్ధి సాధించే దిశగా అడుగులు వేస్తోందని, యువత కోసం కొత్త రంగాలు ఉద్భవిస్తున్నాయని చెప్పారు. ఢిల్లీ ఐఐటీ 57వ స్నాతకోత్సవంలో పాల్గొన్న ప్రధాని మోదీ యువతను ఉద్దేశించి మాట్లాడారు.ఐఐటీ ఢిల్లీలో ప్రారంభించిన కొత్త ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కార్యక్రమాలకు మోదీ శుభాకాంక్షలు - మిగతా 2 లో

## వేలమంది భారతీయులను వెనక్కి పంపిన కెనడా !

- ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 3,323 మంది భారతీయులను బహిష్కరించిన కెనడా
- బహిష్కరణ జాబితాలో మెక్సికన్లను దాటి అగ్రస్థానానికి చేరిన భారతీయులు
- మరో 7,669 మంది ఇండియన్స్ బహిష్కరణ జాబితాలో ఉన్నారని అధికారిక డేటా వెల్లడి

కెనడాలో నివసిస్తున్న భారతీయులకు ఆందోళన కలిగించే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే కెనడా ప్రభుత్వం ఏకంగా 3,323 మంది భారత పౌరులను దేశం నుంచి బహిష్కరించింది. ఈ సంఖ్య గత ఆరేళ్ల రికార్డులను మించిపోయేలా ఉండటం గమనార్హం. కెనడా బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ




## చైనా మ్యాప్ వార్‌కు భారత్ గట్టి కౌంటర్

- అరుణాచల్‌లో 27 ప్రాంతాలకు అధికారిక పేర్లు
- అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రాంతాలకు అధికారిక పేర్లు ఖరారు
- సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో పేర్లను చేర్చిన కేంద్ర ప్రభుత్వం
- చైనా పేరు మార్పు యత్నాలకు గట్టి జవాబుగా ఈ నిర్ణయం
- జాబితాలో వ్యూహాత్మక సరిహద్దు గ్రామాలు, పర్వత కనుమలు
- ప్రాదేశిక సమగ్రతను చాటుకున్న భారత్




అరుణాచల్ ప్రదేశ్ విషయంలో చైనా దూకుడుకు కళ్లెం వేస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని 27 వ్యూహాత్మక ప్రాంతాలకు అధికారికంగా పేర్లను ఖరారు చేసింది. ఈ పేర్లను సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో చేర్చనున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. - మిగతా 2 లో

## భారతీయులకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితమే - ఫోన్‌పే సీఈఓ




- యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు పడతాయన్న వార్తల వేళ ఫోన్‌పే కీలక ప్రకటన
- ఎక్స్ వేదికగా ప్రకటించిన ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్
- యూపీఐ సేవలు ఉచితంగా కొనసాగుతాయని స్పష్టం

యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు పడతాయంటూ జరుగుతున్న చర్చకు ఫోన్‌పే సీఈఓ సమీర్ నిగమ్ - మిగతా 2 లో



## శ్రీశైలానికి పోటెత్తిన వరద

- నిండుకుండలా మారుతున్న జలాశయం
- కృష్ణానది నుంచి శ్రీశైలానికి భారీగా వరద నీరు
- 875 అడుగులకు చేరువలో జలాశయం నీటిమట్టం
- ప్రస్తుత నీటి నిల్వ 162 టీఎంసీలు, పూర్తి సామర్థ్యానికి 10అడుగుల దూరం
- రెండు రాష్ట్రాల పవర్‌హౌస్‌లలో మొదలైన విద్యుదుత్పత్తి
- నాగార్జున సాగర్‌కు కొనసాగుతున్న నీటి విడుదల

కృష్ణా నది ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి - మిగతా 2 లో

## ఏపీపై ఎల్‌నినో పంజా కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్



- ఏపీలో ఎల్‌నినో కారణంగా తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందని షర్మిల ఆందోళన
- ప్రభుత్వం పాలనను గాలికొదిలేసిందని, రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని విమర్శ
- రాష్ట్రంలో 69 శాతం వర్షపాతం లోటు ఏర్పడిందని, 50 లక్షల ఎకరాలు ప్రభావితమయ్యాయని వెల్లడి
- రైతులకు నష్టపరిహారం, రుణాల రీషెడ్యూల్ సహా పలు డిమాండ్లు

ఆంధ్రప్రదేశ్‌లో ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వ్యవసాయ సంక్షోభం నెలకొందంటూ ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వంపై ఆమె విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తాండవిస్తుంటే, ప్రభుత్వం రైతులను గాలికొదిలేసి రాజకీయాలు, పొగడ్త సభల్లో మునిగి తేలుతోందని ఆమె - మిగతా 2 లో

## చేసిన మంచిని చెప్పకపోతే తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- టీడీపీ యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం శిక్షణా తరగతులు
- గొడ్డలి పార్టీ కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని కేడర్‌కు చంద్రబాబు పిలుపు
- ప్రభుత్వ పథకాలు, మంచి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచన
- డీఎస్సీపై ప్రతిపక్షం చేసిన దుష్ప్రచారాన్ని సమర్థంగా ఎదుర్కొన్నామని వెల్లడి



ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని, అదే సమయంలో 'గొడ్డలి పార్టీ' చేస్తున్న కుట్రలు, దుష్ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థంగా తిప్పికొట్టాలని ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో యూనిట్ ఇంఛార్జ్‌ల కోసం నిర్వహించిన శిక్షణా తరగతులకు ఆయన హాజరై ప్రసంగించారు. కార్యకర్తల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకే ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పార్టీ భావజాలాన్ని అర్థం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, "ప్రభుత్వం చేస్తున్న మంచిని ప్రజలకు వివరించాలి. అలా చేయకపోతే, తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మే ప్రమాదం ఉంటుంది. అందుకే చిన్నపామునైనా పెద్ద కర్రతో కొట్టాలి. గొడ్డలి పార్టీ చేసే కుట్రలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలి" అని స్పష్టం చేశారు. ఇటీవల డీఎస్సీ పరీక్షల నిర్వహణలో గొడ్డలి పార్టీ దుష్ప్రచారం చేసేందుకు ప్రయత్నించిందని, అయితే దానికి ప్రభుత్వం గట్టిగా కౌంటర్లు ఇవ్వగలిగిందని గుర్తుచేశారు. "పరీక్షల నిర్వహణలో ఎలాంటి తప్పిదాలు జరగలేదని మేము - మిగతా 2 లో

# సంపాదకీయం

## 'డిజిటల్' భారం సరికాదు!



ప్రారంభమై పదేళ్లు గడిచాక యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా సాగే డిజిటల్ లావాదేవీలకు వడ్డింపు మొదలుకాబోతోంది. లోక్‌సభలో గురువారం గందర గోళం నెలకొన్నప్పుడు, ఎలాంటి చర్చా లేకుండా ఇందుకు సంబంధించిన బిల్లుఆమోదం పొందిందని మీడియా కథనాలు చెబుతున్నాయి. తక్షణమే వర్తించకపోయినా భవిష్యత్తులో ఎప్పుడైనా యూపీఐ లావాదేవీలపై రుసుము వసూలు చేసేందుకు ఈ బిల్లు అధికారమిస్తోంది. ఫీజంటూ వసూలు చేస్తే రూ. 2,000కు మించిన లావాదేవీలపై, అది కూడా వార్షిక టర్నోవర్ కోటిన్నర మించే వ్యాపారులకే వర్తిస్తుందని సన్నాయినొక్కులు నొక్కుతున్నారు.విధించబోయే ఫీజు కూడా ఒక్కో లావాదేవీకి 0.25 శాతం లేదా 0.5 శాతం ఉండొచ్చన్నది మరో మాట. సాధారణ యూపీఐ వినియోగదారులు సాగించే లావాదేవీలన్నీ ఎప్పటిలా యథాతథంగా ఉంటాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దీన్ని విశ్వసించలేం. ఆదాయం పెంచుకునేందుకు అవకాశం ఉన్నప్పుడు ఆ చట్టానికి ముందూ మునుపూ సవరణలు రాబోవని చెప్పలేం. ఆ సంగతలావుంచి తమపై రుద్దే ఈ చార్జీల్ని వ్యాపారులు వినియోగదారుకే బదిలీ చేస్తారు. ఆ అవకాశం లేకుండా తగిన నియంత్రణలు విధిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వగలదా?దేశంలో ఆర్థిక సంస్కరణల ఆగమనంతోపాటే పాలకులు కొత్త రాగం అందు కున్నారు. ప్రభుత్వాలు పాలించాలి తప్ప వ్యాపారం చేయడమేమిటన్నదే దాని సారాంశం. ఆ వంకన లక్షలాదిమంది సిబ్బంది పనిచేసే దిగ్గజ పబ్లిక్ రంగ సంస్థలు అనేకం కనుమరుగయ్యాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణకు గర్వకారణంగా నిలిచి, ఆసియాలోనే అతిపెద్దదైన నిజాం షుగర్స్ కాస్తా ఆనాటి సీఎం చంద్రబాబు పుణ్యమా అని మూతబడింది. కోట్లాది రూపాయల విలువైన దాని ఆస్తుల్ని కారుచవగ్గా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు. నిజాం షుగర్స్ మాదిరిగా మరెన్నో పబ్లిక్ రంగసంస్థలకు తాళాలుపడ్డాయి. వ్యాపారమంటే వదులుకున్నాయిగానీ... ప్రభుత్వాలకు వ్యాపార దృక్పథం పోలేదని యూపీఐ లావాదేవీలపై ఫీజు వసూలు ఆలోచన నిరూపిస్తోంది. యూపీఐ, రూపే వంటివి ఉచిత సేవలు అందించటంవల్ల తమవీసా, మాస్టర్‌కార్డ్ వగైరా ప్లాట్‌ఫాంలు ఎదగటంలేదన్న అమెరికా ఆక్రోశమే తాజా నిర్ణయానికి కారణమని కొందరి ఆరోపణ.బ్రెజిల్‌పై సైతం అమెరికా ఈ మాదిరి ఒత్తిడే తెచ్చినా అది అంగీకరించలేదని కూడా చెబుతున్నారు. వాటి నిజానిజాల సంగతలావుంచి, ప్రభుత్వం చెప్పే కారణాలు మాత్రం ఎప్పటినుంచో వింటున్నవే. యూపీఐ వ్యవస్థ నిర్వహణ తడిసిమోపెడు భారమవుతున్నదని బ్యాంకులూ, పేమెంట్ ప్రాసెసర్లూ గగ్గోలు పెడుతుండటంవల్ల ఇది తప్పడం లేదట! లావాదేవీల నిర్వహణ భారంలోకొంతమేర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోంది. దాంతోపాటు ఈ లావాదేవీలు పెరిగాకబ్యాంకులు తమ సిబ్బందిని తగ్గించుకోలేదా? ఆమేరకు వాటి ఖర్చు తగ్గలేదా? అదీగాక గత దశాబ్దకాలంలో బ్యాంకింగ్ సేవల చార్జీలు, కనీస మొత్తం ఖాతాలో లేదన్న కారణంతో వసూలు చేసే పెనాల్టీ, పరిమితికి మించిన లావాదేవీలపై చార్జీలు, ఎస్ఎంఎస్‌సందేశాలకని, డెబిట్ కార్డు నిర్వహణ వ్యయమని బ్యాంకులు వసూలు చేస్తున్నాయి. ఇవన్నీ చాలకనా ఈ కొత్త ఆలోచనలు!ఈ పదేళ్లలో డిజిటల్ లావాదేవీలు అపారంగా పెరిగాయి. అయినా ఈ పెరుగుదల తగినంతగా లేదని ఆర్థిక నిపుణులంటున్నారు. గూగుల్ పే, పేటీఎం, ఫోన్ పే వగైరాలు వినియోగిస్తున్నవారు వాటిని బ్యాంకింగ్ సేవలుగా చూడటం లేదు... ఆ యాప్‌లను పర్స్‌గా పరిగణించి లావాదేవీలు జరుపుకొంటున్నారు. అలవాటు చేసినట్టే చేసి,దాన్నుంచి కూడా ఆదాయం పొందాలనుకోవటం సరికాదు. ప్రస్తుతం దేశంలో డిజిటల్ లావాదేవీల వినియోగదారుల సంఖ్య 50 కోట్లని చెబుతున్నారు.అయితే ఒక వినియోగదారు సగటున చేసే లావాదేవీలు చూస్తే ప్రపంచ స్థాయికన్నా తక్కువే. అలాగే లావాదేవీల్లో 86 శాతం రూ.500, అంతకన్నా తక్కువ మొత్తాలేనని అంటారు. మొదట్లో ఉన్నంత వృద్ధి ఇటీవలి సంవత్సరాల్లో కనబడటం లేదని కూడా అంటున్నారు. ఇదంతా ఏం చెబుతోంది? ఎంతో వెసులుబాటుగా, ఉపయోగకరంగా ఉన్న ఈ లావాదేవీలు మరింత విస్తరించాల్సిన తరుణంలో వాటిని నిరుత్సాహపరిచేలా, జనం మళ్లీ నగదు వైపు మొగ్గేలా చేయటం వింతకాదా? ప్రభుత్వం ఆలోచించాలి.

## శ్రీశైలానికి పోటెత్తిన వరద

చేరుతుండటంతో శ్రీశైలం జలాశయం నిండుకుండను తలపిస్తోంది. ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతుండటంతో నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. శుక్రవారం రాత్రి 9 గంటల సమయానికి జూరాల ప్రాజెక్టు నుంచి 2,57,059 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయగా, శ్రీశైలం జలాశయానికి 2,11,331 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది.శ్రీశైలం జలాశయం గరిష్ఠ నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం అది 874.70 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయిలో నిండటానికి మరో 10 అడుగుల మేర నీరు చేరాల్సి ఉంది. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 162.81 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రానున్న రెండు, మూడు రోజుల్లో నీటి నిల్వ 200 టీఎంసీలను దాటుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. మరో రెండు రోజుల పాటు సుమారు 2 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగే అవకాశం ఉందని వెల్లడించారు.భారీగా వరద నీరు వస్తుండటంతో అధికారులు జలవిద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించారు. తెలంగాణ పరిధిలోని ఎడమగట్టు విద్యుత్ కేంద్రంలో 21,189 క్యూసెక్కుల నీటిని వినియోగించి 7.319 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో 9,603 క్యూసెక్కుల నీటితో 1.684 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. విద్యుదుత్పత్తి అనంతరం 30,792 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. వీటితో పాటు వెలిగోడుకు 4,000 క్యూసెక్కులు విడుదల చేయగా, శనివారం గోరకల్లు జలాశయానికి మరో 4,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## చైనా మ్యాప్ వార్‌కు భారత్ గట్టి కౌంటర్

రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది.ఈ జాబితాలో అప్పర్ సుబన్‌సిరి జిల్లాలోని లాంగ్జు, మాజా, బిసా వంటి కీలక సరిహద్దు గ్రామాలు ఉన్నాయి. వీటితో పాటు, జో లా, రిజా లా, పుకుర్ లా, థాగ్ లా అనే నాలుగు పర్వత కనుమలు, ఎత్తైన సంభో సరోవర్ సరస్సు, షేర్-ఎ-థాపా స్మారక చిహ్నం వంటి ప్రదేశాలు కూడా ఉన్నాయి. అంజావ్, చాంగ్‌లాంగ్, వెస్ట్ కామెంగ్, లోహిత్, తవాంగ్ జిల్లాల్లోని పలు ప్రాంతాలకు కూడా పేర్లను స్థిరీకరించారు.అరుణాచల్ ప్రదేశ్‌లోని ప్రాంతాలకు చైనా పదేపదే కొత్త పేర్లు పెడుతూ వివాదం సృష్టిస్తున్న నేపథ్యంలో, భారత్ ఈ చర్యలు చేపట్టింది. ఈ ప్రాంతాలపై స్పష్టత ఇవ్వడం, ప్రజలకు అవగాహన కల్పించడమే తమ లక్ష్యమని ప్రభుత్వం పేర్కొంది. ఈ ప్రదేశాల్లో చాలా వరకు ఇప్పటికే భారత సైనిక మ్యాపుల్లో ఉన్నాయని, ఇప్పుడు సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల్లో చేర్చడం ద్వారా ప్రాదేశిక సరిహద్దులపై ఎలాంటి అస్పష్టత లేకుండా పోతుందని అధికారులు వివరించారు. 1959 నాటి లాంగ్జు ఘటన, 1962 యుద్ధంతో సంబంధం ఉన్న చారిత్రక ప్రదేశాలు కూడా ఈ జాబితాలో ఉండటం గమనార్హం. పేర్లు మార్చినంత మాత్రాన అరుణాచల్ ప్రదేశ్ తమ అంతర్భాగమన్న వాస్తవం మారదని భారత్ ఎప్పటికప్పుడు స్పష్టం చేస్తూనే ఉంది. ఈ తాజా నిర్ణయంతో తన ప్రాదేశిక సమగ్రత విషయంలో భారత్ ఎంత దృఢంగా ఉందో మరోసారి స్పష్టమైంది.


## సాగునీటి ప్రాజెక్టులకు రూ.5 వేల కోట్ల నిధులు



96 శాతం పూర్తైన రోళ్లవాగుపై ప్రత్యేక దృష్టి సారించామని అన్నారు. రోళ్లవాగుతో 15 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరు అందజేస్తామని చెప్పుకొచ్చారు. భూసేకరణ, టెండర్లు, అనుమతులను సమాంతరంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. నిర్వాసితులకు పరిహారం, పునరావాసం వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి పెండింగ్ సమస్యను 'యాక్షన్ పాయింట్'గా మార్చాలని సూచించారు. తదుపరి సమీక్షకు యాక్షన్ టేకెన్ రిపోర్ట్ తప్పనిసరని ఆదేశించారు. ఆయా ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ పేర్కొన్నారు.

## చేసిన మంచిని చెప్పకపోతే, తప్పుడు ప్రచారమే నిజమనుకుంటారు

వాస్తవాలు చెప్పడం వల్లే.. గొడ్డలి పార్టీ మినహా కొన్ని ఇతర పార్టీలకు చెందిన నేతలు కూడా తప్పులు జరగలేదని బహిరంగంగా చెబుతున్నారు. ఇప్పుడు అదే డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన టీచర్లే గొడ్డలి పార్టీ తీరును తప్పుపడుతూ ఆందోళనలు చేపట్టారు" అని చంద్రబాబు వివరించారు.ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి వాస్తవాలు ప్రజల ముందు ఉంచితే, కుట్రలను వారే ఛేదిస్తారని అన్నారు. దీనికి కర్నూల్‌లో టీచర్లు గొడ్డలి పార్టీకి వ్యతిరేకంగా చేస్తున్న ఆందోళనే నిదర్శనమని తెలిపారు. మంచి పనులు చేస్తే ప్రజలు సహకరించి భాగస్వాములు అవుతారనడానికి భోగాపురం విమానాశ్రయ ప్రారంభోత్సవమే ఉదాహరణ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ఇటీవలే ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇచ్చానని, ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వ్యవస్థలను గాడిలో



పెడుతూ సంక్షేమం-అభివృద్ధిని సమంగా ముందుకు తీసుకెళు_న్నామని తెలిపారు.పార్టీ క్రమశిక్షణపై మాట్లాడుతూ, సాధారణ కార్యకర్త నుంచి అగ్ర నాయకుడి వరకు అందరికీ పార్టీనే సుప్రీం అని చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యకర్తలను పట్టించుకోని వారిని, పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వెళ్లే వారి విషయంలో 'జీరో టాలరెన్స్' పాటిస్తామని హెచ్చరించారు. ప్రతి నియోజకవర్గంలో ఏం జరుగుతుందో తాను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూనే ఉన్నానని అన్నారు.గొడ్డలి పార్టీ రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏ ఎన్నికలు జరిగినా, ప్రతి బూత్‌లోనూ గత ఎన్నికల్లో వచ్చిన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లు సాధించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రభుత్వ అధికారి, ప్రజాప్రతినిధి, నాయకుడి ప్రవర్తన ఓట్లపై ప్రభావం చూపుతుందని, యూనిట్, క్లస్టర్ ఇంఛార్జ్‌లకు, మండల అధ్యక్షులకు తగిన గౌరవం దక్కేలా చూస్తామని హామీ ఇచ్చారు.

## ఏపీపై ఎల్‌నినో పంజా.. కూటమి ప్రభుత్వంపై షర్మిల ఫైర్

తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, కింజరాపు అచ్చెన్నాయుడితో పాటు ప్రధాని నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియా వేదికగా ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు.రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను షర్మిల గణాంకాలతో సహా వివరించారు. జూలై చివరి నాటికి రాష్ట్రవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే 69 శాతం వర్షపాతం లోటు నమోదైందని తెలిపారు. జూన్ 1 నుంచి జూలై మధ్య వరకు 166.76 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, కేవలం 86.51 మి.మీ. మాత్రమే నమోదైందని ఆవేదన వ్యక్తం చేశారు. రాబోయే మూడు నెలల్లో సైతం 40 శాతం లోటు వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని, దీని ప్రభావం ప్రత్యక్షంగా 50 లక్షల ఎకరాలపై పడిందని అన్నారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర, కోస్తా అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని, ఎటు చూసినా బీడు భూములే కనిపిస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు.ఈ క్లిష్ట పరిస్థితుల్లో ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని షర్మిల ఆరోపించారు. "పాలనను గాలికొదిలేసి, కులమత కొట్లాటల్లో, కేసుల్లో, మోదీ పొగడ్త సభల్లో మీరు, మీ ఎమ్మెల్యేలు, ఎంపీలు బిజీగా ఉన్నారు. అటు వైసీపీ, ఇటు కూటమి రెండూ ఒకటే. వీరికి రాష్ట్రం, ప్రజల బాగోగులు పట్టవు" అని ఆమె వ్యాఖ్యానించారు.ఆరేడు నెలలుగా ఎల్‌నినో ముప్పు పొంచి ఉందని ప్రపంచవ్యాప్తంగా హెచ్చరికలు వస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వం కనీస కంటింజెన్సీ ప్రణాళికలు కూడా సిద్ధం చేయలేదని దుయ్యబట్టారు. జిల్లాల వారీగా సమీక్షలు, రైతులకు మార్గదర్శకాలు, ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం క్వాంటం, డేటా సెంటర్లంటూ కబుర్లు చెబుతూ కాలం గడుపుతున్నారని, మిమ్మల్ని నమ్ముకున్న లక్షలాది రైతుల బతుకులు బుగ్గిపాలవుతున్నాయని మండిపడ్డారు.ఈ నేపథ్యంలో, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏపీ కాంగ్రెస్ తరఫున పలు డిమాండ్లను ఆమె ప్రభుత్వం ముందు ఉంచారు.


**కాంగ్రెస్ పార్టీ డిమాండ్లు:**

1. ఎండిపోయిన పంటలకు ఎకరాకు తగిన నష్టపరిహారం చెల్లించాలి.
2. తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను ఉచితంగా లేదా సబ్సిడీపై అందించాలి.
3. రిజర్వాయర్ల నుంచి చివరి ఆయకట్టు భూములకు కూడా నీరందేలా చూడాలి.
4. వ్యవసాయ రుణాలను రీషెడ్యూల్ చేయాలి.
5. రైతులకు కొత్తగా వడ్డీ లేని రుణాలు అందించాలి.
6. ఎల్‌నినో నష్టాలను అంచనా వేసి ప్రతి రైతుకు ఉచితంగా పంటల బీమా వర్తింపజేయాలి.
7. పశుగ్రాసం కొరత తీర్చేందుకు పాడి రైతులకు ప్రత్యేక సబ్సిడీలు ఇవ్వాలి.

తక్షణమే మేల్కొని మంత్రులను, ప్రభుత్వ యంత్రాంగాన్ని రంగంలోకి దింపి రైతులను ఆదుకోవాలని షర్మిల సూచించారు. "ఇప్పటికైనా కళ్ళు తెరవకపోతే రైతులు, ఇతర వర్గాల ప్రజలతో కలిసి మీ సర్కారు వెన్ను విరిచి మరీ నిలదీస్తారని మరవకండి" అని ఆమె ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## సవాళ్లే అవకాశాలుగా మారుతాయి- నేర్చుకునే వాడు గెలుస్తాడు

తెలిపారు. ఒకప్పుడు సెమీకండక్టర్ల రంగంలో భారత్ సత్తాను కొందరు శంకించారని, అయితే ఇప్పుడు తొలి సెమీకండక్టర్ యూనిట్‌లో ఉత్పత్తి ప్రారంభమైందని గుర్తుచేశారు."ఈరోజు ప్రపంచం అత్యంత వేగంగా మారుతున్న తరుణంలో మీరు ఈ ఇన్‌స్టిట్యూట్ నుంచి బయటకు అడుగుపెడు తున్నారు. నేడు ప్రపంచ వ్యూహాత్మక సమీకరణాలు చాలా వేగంగా మారుతున్నాయి. గ్లోబల్ పవర్ బ్యాలెన్స్ కూడా అనుక్షణం మారుతోంది. దీని వెనుక ఉన్న అతిపెద్ద శక్తి టెక్నాలజీ వేగం. రానున్న 20 నుంచి 30 ఏళ్లలో ప్రపంచం ఎలా ఉంటుందని ఈరోజు ఎవరూ కచ్చితంగా చెప్పలేరు. కానీ , మార్పుల పర్వం వచ్చినప్పుడల్లా సవాళ్లు కూడా వస్తుంటాయి. అలాగే కొత్త అవకా శాలు కూడా పుట్టుకొస్తాయి. ప్రపంచం మారుతుంది, టెక్నాలజీ మారుతుంది, పరిశ్రమలు మారుతాయి, వృత్తులు కూడా మారు తాయి. కానీ వీటన్నింటి మధ్య నా మాట ఒకటి గుర్తుంచుకోండి. ఎవరైతే నిత్య విద్యార్థిగా ఉంటారో వారే గెలుస్తారు. జీవితంలో ఎప్పుడూ కుతూహలం కలిగి ఉండి, వికసిత్ భారత్ కోసం విద్యార్థు లు తమవంతు పాత్ర పోషించాలి. కొత్త సవాళ్లకు కొత్త పరిష్కారాలను కనుగొనే ధైర్యం ఎవరికైతే ఉంటుందో, ఆ సవాళ్లే వారికి అవకాశాలుగా మారుతాయి.'వికసిత్ భారత్' సాకారం చేయడంలో యువత తీసుకునే నిర్ణయాలే కీలక పాత్ర పోషిస్తాయని మోదీ పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా పురోగమి స్తున్నందున ప్రపంచ వ్యూహాత్మక సమీకరణాలు, అధికార సమతుల్యత నిరంతరం మారుతున్నాయని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి ఆర్థిక, సాంకేతిక, పారిశ్రామిక స్వావలంబన అవసరమని పిలుపునిచ్చారు. ప్రతి తరానికి కొన్ని సవాళ్లు, జాతీయ బాధ్యతలు ఉంటాయని, విద్యార్థులు తమ జీవితంలో రానున్న 35 ఏళ్లలో తీసుకునే నిర్ణయాలు 'వికసిత్ భారత్' ప్రయాణాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపారు. యువ శక్తి తీసుకునే ప్రతి నిర్ణయం దేశానికి ఎలా ఉపయోగపడుతుంది, దేశ అవసరాలను ఎలా తీరుస్తుందనే కోణంలో ఉండాలని సూచించారు.ప్రతి రంగంలో స్వావలంబన అనేది వికసిత్ భారత్ అభివృద్ధికి పునాది అని మోదీ పేర్కొన్నారు. దేశంలో 'చిప్ నుంచి షిప్' వరకు ప్రతిదీ మన యువత చేతుల మీదుగానే తయారవుతుందని ఆయన నొక్కి చెప్పారు. డ్రోన్ వంటి సాంకేతిక రంగాల్లో యువత కొత్త అవకాశాలను సృష్టిస్తోందని తెలిపారు. వాటి సహాయంతో వ్యవసాయం, మందుల సరఫరా, దేశ రక్షణ, భద్రతలో సహాయపడుతున్నాయని చెప్పారు. యువ శక్తి ఆవిష్కరణల కోసం ఏఐ, డేటా కేంద్రాలు ఎదురుచూస్తున్నాయని, భారత్ సరికొత్త పరిశోధనలు కోరుకుంటోందని అన్నారు. అలాగే, అకాడమిక్ మౌలిక సదుపాయాలు మరింతగా పెంచామని, పరిశోధనల రంగానికి రూ.లక్ష కోట్ల నిధులు కేటాయించామని స్పష్టం చేశారు. కాగా, ఈ స్నాతకోత్సవంలో 587 మంది గ్రాజుయేట్ స్కాల ర్లతో సహా మొత్తం 3వేల మందికి పైగా విద్యార్థులు తమ పట్టాలను అందుకున్నారు. విద్యార్థులకు రాష్ట్రపతి స్వర్ణ పతకం,



డైరెక్టర్ స్వర్ణ పతకం, శంకర్‌దయాళ్ శర్మ స్వర్ణ పతకం, పర్‌ఫెక్ట్ టెన్ స్వర్ణ పతకాలను మోదీ బహుకరించారు.ఇదిలా ఉండగా, స్నాతకోత్సవ కార్యక్రమంలో భాగంగా ఐఐటీ ఢిల్లీ సోనిపత్ క్యాంపస్‌లో ఏఐ ఆధారిత సూపర్ కంప్యూటింగ్ కేంద్రమైన 'పరం ప్రజ్ఞ'ను మోదీ ప్రారంభించారు. ఇది కృత్రిమ మేధ(ఏఐ) సామర్థ్యాలతో పనిచేసే అత్యంత ఆధునిక హై-పర్‌ఫార్మెన్స్ కంప్యూటింగ్ వ్యవస్థ. ఇది డేటా సైన్స్, అధునాతన కంప్యూటింగ్, అంతర్విభాగ పరిశోధన రంగాల్లో సామర్థ్యాలను గణనీయంగా పెంచుతుందని ప్రధానమంత్రి కార్యాలయం పేర్కొంది.

## వేలమంది భారతీయులను వెనక్కి పంపిన కెనడా !




(సీబీఎస్ఏ) విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2025 ఏడాది మొత్తంలో 3,779 మంది భారతీయులను బహిష్కరించగా, ఈ ఏడాది కేవలం ఆరు నెలల్లోనే ఆ సంఖ్యలో దాదాపు 88 శాతానికి చేరుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. వలస నిబంధనలను కఠినతరం చేస్తున్న నేపథ్యంలోనే ఈ బహిష్కరణలు పెరిగినట్లు స్పష్టమవుతోంది. అంతర్జాతీయ విద్యార్థులు, తాత్కాలిక విదేశీ కార్మికుల సంఖ్యను తగ్గించుకునేందుకు కెనడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ డేటా ప్రాధాన్యం సంతరించుకుంది.ఇప్పటివరకు కెనడా నుంచి బహిష్కరణకు గురైన వారి జాబితాలో మెక్సికన్లు అగ్రస్థానంలో ఉండేవారు. కానీ, ఈ ఏడాది భారతీయులు వారిని అధిగమించారు. తొలి అర్ధభాగంలో 3,323 మంది భారతీయులను బహిష్కరించగా, మెక్సికన్ల సంఖ్య 1,573గా ఉంది. గత ఐదేళ్లుగా బహిష్కరణల జాబితాలో మెక్సికో మొదటి స్థానంలో, భారత్ రెండో స్థానంలో కొనసాగాయి. చివరిసారిగా 2020లో 1,424 మందితో భారతీయులు అగ్రస్థానంలో నిలిచారు.వలస నిబంధనలను పాటించకపోవడం, వీసా గడువు ముగిసినా అక్కడే ఉండిపోవడం, ఆశ్రయం కోసం చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురవడం, వీసా మోసాలకు పాల్పడటం వంటి కారణాలతోనే కెనడా ప్రభుత్వం ఎక్కువగా బహిష్కరణ వేటు వేస్తున్నట్లు తెలుస్తోంది. సీబీఎస్ఏ డేటా ప్రకారం.. మరో 7,669 మంది భారతీయులు బహిష్కరణ ప్రక్రియ జాబితాలో ఉన్నారు. అంటే.. సమీప భవిష్యత్తులో వీరిని కూడా దేశం విడిచి వెళ్లమని ఆదేశించే అవకాశం ఉంది.బహిష్కరణ ఉత్తర్వులు సాధారణంగా మూడు రకాలుగా ఉంటాయి. డిపార్చర్ ఆర్డర్ పొందిన వారు 30 రోజుల్లో స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లాలి. లేదంటే అది డిపోర్టేషన్ ఆర్డర్‌గా మారుతుంది. ఎక్స్‌క్లూజన్ ఆర్డర్ కింద ఒకటి నుంచి ఐదేళ్ల వరకు కెనడాలోకి తిరిగి ప్రవేశించకుండా నిషేధం విధిస్తారు. ఇక, డిపోర్టేషన్ ఆర్డర్ వస్తే.. కెనడా ప్రభుత్వ ప్రత్యేక అనుమతి లభించనిదే శాశ్వతంగా దేశంలోకి అడుగుపెట్టలేరు. అమెరికాతో పోలిస్తే కెనడా నుంచి బహిష్కరణకు గురవుతున్న భారతీయుల సంఖ్య రెండున్నర రెట్లు అధికంగా ఉండటం గమనార్హం.

## భారతీయులకు యూపీఐ సేవలు ఎప్పటికీ ఉచితమే - ఫోన్‌పే సీఈఓ

తెరదించారు. సాధారణ వినియోగదారులు యూపీఐ ద్వారా డబ్బు పంపేందుకు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. "భారతీయ వినియోగదా రులందరికీ యూపీఐ ఉచితంగానే ఉంటుంది" అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. లోక్‌సభలో కొత్త పన్ను సవరణ బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించే అంశంపై చర్చ మొదలైంది. దీంతో యూపీఐ వాడితే సామాన్యుల నుంచి కూడా ఛార్జీలు వసూలు చేస్తారా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి.అయితే ఎండీఆర్ ఉంటే అది వ్యాపార సంస్థల పరిధిలోనే ఉంటుందని పేమెంట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా తెలిపింది. చిన్న దుకాణాలు, కిరాణా వ్యాపారులు యూపీఐ చెల్లింపులు స్వీకరించేందుకు ఎలాంటి ఎండీఆర్ చెల్లించా ల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.డిజిటల్ చెల్లింపులు స్వీకరించే వ్యాపారులు పేమెంట్ సేవల సంస్థలకు చెల్లించే రుసు మునే ఎండీఆర్ అంటారు. కొత్త నిబంధనల ప్రకారం రూ. 2,000కు మించిన కొన్ని వ్యాపార సంబం ధిత ఎలక్ట్రానిక్ చెల్లింపులపై 0.25 శాతం నుంచి 0.4 శాతం వరకు ఎండీఆర్ విధించే అవకా శం ఉంది. వ్యక్తిగతంగా ఒకరి నుంచి మరొకరికి చేసే యూపీఐ చెల్లింపులకు ఇది వర్తించదు. కొత్త బిల్లు యూపీఐ వినియోగదారులపై నేరుగా ఛార్జీలు విధించడం లేదని పీసీఐ స్పష్టం చేసింది. దాదాపు పదేళ్లుగా బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలు, ఎన్‌పీసీఐ, ఆర్‌బీఐ కలిసి యూపీఐ వ్యవస్థ నిర్వహణ, సైబర్ భద్రత, మోసాల నివారణ వంటి ఖర్చులను భరిస్తున్నాయి. ఇకపై ఈ వ్యవస్థకు స్థిరమైన ఆర్థిక నమూనాపై చర్చ జరుగుతోంది.

## కేసీఆర్ చేసినన్ని యాగాలు దేశంలో ఎవరూ చేసి ఉండరు

మాట్లాడుతూ, దైవబలం సిద్ధించాలంటే ముందుగా మానవ ప్రయత్నం ఉండాలని, యాగాలు నిర్వహిస్తూనే ప్రభుత్వాలు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు.కాంగ్రెస్ నేతలు చిల్లర రాజకీయాలకు పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ అగ్రనేత హరీశ్ రావు దేవాలయాలకు వెళ్లడాన్ని ఎగతాళి చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యవసాయం, రైతాంగ సమస్యలపై కనీస అవగాహన లేదని ఆయన ఆరోపించారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే ముఖ్యమంత్రి, ఆ జిల్లాకు సాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమయ్యారని మండిపడ్డారు.రాష్ట్ర నీటి హక్కులను కాపాడటంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తరలిస్తుంటే ఇక్కడి ప్రభుత్వం ఏం చేస్తోందని ఆయన ప్రశ్నించారు. గోదావరి బోర్డు సమావేశంపై ప్రభుత్వ తన వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు.తాము అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాష్ట్ర శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ 24 గంటల విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారో నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. 'హైడ్రా' పేరుతో పేదలపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. నీటి హక్కుల పరిరక్షణ కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమ తరహాలోనే మరో భారీ పోరాటానికి సిద్ధమవుతామని కేటీఆర్ హెచ్చరించారు.

## తెలంగాణలో త్వరలో మద్యం ధరల పెంపు!



బ్రాండ్ల ధరలను పెంచేందుకు కసరత్తు చేస్తోంది. దీనిపై ఏర్పాటు చేసిన సబ్-కమిటీ, సవరించిన ఎంఆర్‌పీ ధరలతో కూడిన నివేదికను గురువారం ప్రభుత్వానికి సమర్పించింది. ఈ నివేదికను పరిశీలించిన తర్వాత ఎక్సైజ్ శాఖ తుది నిర్ణయం తీసుకోనుంది. ఆగస్టు 15 తర్వాత ఎప్పుడైనా కొత్త ధరలు అమల్లోకి వచ్చే అవకాశం ఉందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.రాష్ట్రంలో చివరిసారిగా 2022-23 ఆర్థిక సంవత్సరంలో మద్యం ధరలను సవరించారు. నిబంధనల ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి ధరలను సమీక్షించాల్సి ఉన్నప్పటికీ, గత మూడేళ్లుగా పెంపుదల లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని మద్యం తయారీ సంస్థలు (డిస్టిలరీలు) ప్రభుత్వానికి విన్నవించాయి. ముడిసరుకుల ధరలు, రవాణా ఛార్జీలు, సిబ్బంది జీతాలు, పన్నుల భారం గణనీయంగా పెరిగిందని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 'ధరల నిర్ణయ కమిటీ'ని ఏర్పాటు చేసి, డిస్టిలరీల ప్రతినిధులతో చర్చలు జరిపింది. పెరిగిన వ్యయాన్ని పరిగణనలోకి తీసుకుని కమిటీ ఈ నివేదికను రూపొందించింది.ప్రస్తుత పరిస్థితుల్లో 10 నుంచి 15 శాతం వరకు ధరలు పెంచాలని డిస్టిలరీలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే, ధరల పెంపు విషయంలో ప్రభుత్వం ఆచితూచి వ్యవహరిస్తోంది. మద్యం ధరలను భారీగా పెంచితే, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుంచి మద్యం అక్రమ రవాణా పెరిగే ప్రమాదం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. దీనివల్ల రాష్ట్ర ఆదాయానికి గండి పడుతుంది. అందుకే, పొరుగు రాష్ట్రాల్లోని ధరలతో పోల్చి చూసిన తర్వాతే పెంపుదల శాతాన్ని ఖరారు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. సబ్-కమిటీ నివేదికను క్షుణ్ణంగా పరిశీలించి, త్వరలోనే ప్రభుత్వం తుది నిర్ణయాన్ని ప్రకటించనుంది.

ఆదివారం 09-08-2026

# వలస బాట పట్టిన కూలీలు...!!

### గ్రామాల్లో వ్యవసాయ కూలీలు కాళీ అవుతున్న దృశ్యం

### రైల్వే స్టేషన్ లో రైలు కోసం ఎదురుచూస్తున్న వలస కూలీలు







**కోసిగి,ప్రభ మనం ఆగస్టు 08 :** వర్షాభావ పరిస్థితులతో పంటలు పండక, స్థానికంగా ఉపాధి దొరక్క కోసిగి మండల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు.బతుకుదెరువు కోసం నిత్యం వందలాది మంది రైతు కూలీలు ఉదయమే 7 గంటలకు బయలుదేరి రాత్రి 9 గంటలకు తిరిగి గ్రామానికి చేరుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.కోసిగి రైల్వే స్టేషన్ నుంచి రైళ్ల మార్గంలో పక్క రాష్ట్రమైన కర్ణాటకకు రాయచూర్ సైదాపూర్ కు కూలి పనులకు వెళ్తున్నారు.పిల్లాపాపలతో అన్నం చద్ది మూటలు కట్టుకొని వెళ్తున్న వీరి పరిస్థితిపై అధికారులు స్పందించి స్థానికంగా పనులు కల్పించాలని అలాగే కోసిగి మండలాన్ని కరువు ప్రాంతంగా గుర్తించాలని కోరుతున్నారు...

# మట్కా బీటర్లు అరెస్టు

### రూ. 18450 నగదు ,సెల్ ఫోన్ లు స్వాధీనం

**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్ ;-** మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామంలో మట్కా బీటర్లు ను మాధవరం పోలీసులు శనివారం పట్టుకున్నారు. మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపిన వివరాలు మేరకు రచ్చుమర్రి గ్రామానికి చెందిన బోయ రామలింగప్ప , విద్యానగర్ తాండ గ్రామానికి చెందిన బోయరాజు , గంగులప్ప లు రచ్చుమర్రి గ్రామంలో తిమ్మప్ప తాత మఠం దగ్గర ఆన్లైన్ యాప్ ద్వారా మట్కా ఆడుతుండగా రాబడిన సమాచారం మేరకు పోలీస్ సిబ్బందితో వెళ్లి దాడులు చేసి ముగ్గురిని అదుపులో తీసుకొని వారి వద్ద ఉన్న రూ. 18,450 నగదు సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని వారి పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎవరైనా మట్కా రాసిన లేదా ఆడిన క్రికెట్ బెట్టింగ్ ,తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారి పై కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

# డీఎస్సీ అక్రమాలపై న్యాయ విచారణ జరిపించాలి

### నిరుద్యోగ అభ్యర్థులకు న్యాయం చేయాలి: చంద్రశేఖర్‌రెడ్డి



**తుగ్గలి, ఆగస్టు 8 ( ప్రభ మనం,న్యూస్):** డీఎస్సీ నియామక ప్రక్రియలో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్న అక్రమాలు, అవకతవకలపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ తాలూకా ఐటీ విభాగం అధ్యక్షులు తుగ్గలి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు.శనివారం పత్తికొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవమ్మ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షకు చంద్రశేఖర్‌రెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల్లో పారదర్శకతకు పెద్దపీట వేయాల్సిన ప్రభుత్వం, అభ్యర్థుల అనుమానాలకు తావులేకుండా పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. డీఎస్సీ ఉద్యోగాల కోసం వేలాది మంది నిరుద్యోగులు సంవత్సరాల తరబడి కష్టపడి చదివి, పరీక్షలకు సిద్ధమయ్యారని ఆయన పేర్కొన్నారు. నియామక ప్రక్రియలో ఏ చిన్న అవకతవక జరిగినా మెరిట్ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.అర్హత ఉన్న అభ్యర్థుల హక్కులను కాపాడటంతో పాటు, నియామక ప్రక్రియపై వచ్చిన ఆరోపణలను నిష్పక్షపాతంగా విచారించి బాధ్యులెవరైనా కఠిన చర్యలు తీసుకోవాలని చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అక్రమాలు రుజువైతే బాధిత అభ్యర్థులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, డీఎస్సీ అభ్యర్థులు, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ మఠంలో మానవ హక్కుల కమీషన్ మెంబర్ డాక్టర్ కిషోర్



**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్ ;-** ఆధ్యాత్మిక క్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థం తెలంగాణ మానవ హక్కుల కమిషన్ మెంబర్ డాక్టర్ కిషోర్ కుటుంబ సభ్యులతో శనివారం వచ్చారు. వారికి మంత్రాలయం తహశీల్దార్ రమాదేవి , సీనియర్ అసిస్టెంట్ జయరామిరెడ్డి స్వాగతం పలికారు. వారు ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని , ప్రత్యేక పూజలు చేసి మంగళహారతి ఇచ్చారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకున్నారు. వారికి మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థులు శేషవస్త్రం కప్పి , ఫల మంత్రాక్షితలు , రాఘవేంద్రస్వామి మెమోంటో ఇచ్చి ఆశీర్వదించారు. మఠం ఇంజినీర్ సురేష్ కొనపూర్ , తదితరులు ఉన్నారు.

# అమీనాబాద్‌లో ఇంటింటా టీడీపీ.. సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం

### అమీనాబాద్ మధుబాబు చౌదరి



**తుగ్గలి, ఆగస్టు 8 ( ప్రభ మనం,న్యూస్):** తుగ్గలి మండలంలోని అమీనాబాద్ గ్రామంలో శనివారం 'ఇంటింటా టీడీపీ' కార్యక్రమాన్ని పార్టీ నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. కర్నూలు ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ తుగ్గలి నాగేంద్ర, మాజీ జెడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, మాజీ రాష్ట్ర డైరెక్టర్ తిమ్మయ్య చౌదరి ఆధ్వర్యంలో నాయకులు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా టిడిపి,ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని నాయకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే 'ఇంటింటా టీడీపీ' కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు అన్నారు. ఎమ్మెల్యే కేఈ శ్యామ్‌కుమార్ సూచనల మేరకు పార్టీ శ్రేణులు ప్రజలకు మరింత చేరువగా పనిచేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు విజయలక్ష్మి, వెంకటరెడ్డి, రామలింగయ్య, టీడీపీ మండల కన్వీనర్ తిరుపాల్ నాయుడు, సొసైటీ అధ్యక్షుడు అప్పా వేణుగోపాల్, నాయకులు మధుబాబు చౌదరి, సతీష్ చౌదరి, రామకృష్ణ యాదవ్, మిద్దె వెంకటేశ్వర్లు యాదవ్, బీసీ వెంకటస్వామి, చంద్రశేఖర్ యాదవ్, లక్ష్మీనారాయణ చౌదరి, గోపాల్ చౌదరి, కొమ్ము వెంకటేష్, పక్కీరప్ప, సంఘాల కృష్ణ, అక్బర్ బాషా, రాము, బాలరాముడు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యం




**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్ ;-** కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని టిడిపి మండల అధ్యక్షులు గోపాల్ రెడ్డి, మంత్రాలయం పట్టణ అధ్యక్షుడు వరదరాజులు అన్నారు. శనివారం టిడిపి ఇన్చార్జ్ రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మంత్రాలయంలోని పలు కాలనీలో ఇంటింటికి కార్యక్రమం చేపట్టారు . ఈ సందర్భంగా వారు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సంక్షేమ పథకాలు పథకాల గురించి ప్రజలకు వివరించారు. కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ పవన్ కుమార్ టిడిపి నాయకులు రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

# మెగా డీఎస్సీపై దుష్ప్రచారానికి ఉపాధ్యాయుల గర్జన

### ఆత్మగౌరవ ర్యాలీతో జగన్ ఆరోపణలకు దీటైన సమాధానం

### టిడిపి జిల్లా అధికార ప్రతినిధి శ్రీమతి నరవ శశిరేఖ



**పెద్దకడబూరు,ఆగష్టు 08,ప్రభ మనం:** మెగా డీఎస్సీ నియామకాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలకు కర్నూలులో ఉపాధ్యాయులు నిర్వహించిన ఆత్మగౌరవ ర్యాలీ దీటైన సమాధానం ఇచ్చిందని టీడీపీ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ అన్నారు. శనివారం పెద్దకడబూరులోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. మెగా డీఎస్సీ ద్వారా 16,347 మంది ఉపాధ్యాయులు నెలల తరబడి కష్టపడి చదివి, పరీక్షల్లో ప్రతిభతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు.ఆధారాలు లేకుండా అక్రమాల ఆరోపణలు చేయడం వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని మండిపడ్డారు.డీఎస్సీలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న జగన్ ఎవరికి,ఎక్కడ,ఎలా అన్యాయం జరిగిందో ఆధారాలతో ప్రజల ముందు నిరూపించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో మెగా డీఎస్సీ నిర్వహించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. 2019--2024 మధ్య వైసీపీ ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో జగన్ సమాధానం చెప్పాలని ఆమె ప్రశ్నించారు.రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిభతో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులపై విషప్రచారం చేయడం మానుకోవాలని హితవు పలికారు. మెగా డీఎస్సీపై అనుమానాలు ఉంటే ఆధారాలతో ఈ నెలలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ముందుకు రావాలనిటీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ డిమాండ్ చేశారు.

# సొంత ఖర్చుతో ఎస్సీ కాలనీకి వెలుగులు.. మిద్దె సోదరుల మానవత్వం

### రూ.20 వేలతో 70 విద్యుత్ బల్బుల ఏర్పాటు.. చీకటికి చెక్




**తుగ్గలి, ఆగస్టు 8 ( ప్రభ మనం,న్యూస్):** తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలో చీకట్లో మగ్గుతున్న ఎస్సీ కాలనీ ప్రజల కష్టాలను గుర్తించి టీడీపీ నాయకులు మిద్దె రవికుమార్ యాదవ్, మిద్దె వెంకటేష్ యాదవ్ తమ సొంత ఖర్చుతో విద్యుత్ బల్బులు ఏర్పాటు చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామంలోని ఎస్సీ కాలనీలో చాలాకాలంగా వీధి దీపాలు లేకపోవడంతో రాత్రివేళల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చీకట్లో విషసర్పాలు సంచరిస్తుండటంతో చిన్నపిల్లలు, మహిళలు, వృద్ధులు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఈ విషయం తెలుసుకున్న మిద్దె సోదరులు వెంటనే స్పందించి సుమారు రూ.20 వేల సొంత నిధులతో 70 విద్యుత్ బల్బులను ఏర్పాటు చేశారు. దీంతో ఎస్సీ కాలనీలోని వీధులన్నీ విద్యుత్ వెలుగులతో నిండిపోయాయి. చీకటి కారణంగా నెలకొన్న భయాందోళనలు కొంతమేర తొలగడంతో కాలనీ ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వైపు మాత్రమే ఎదురుచూడకుండా, తమకు తోచిన విధంగా గ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు మిద్దె రవికుమార్ యాదవ్, మిద్దె వెంకటేష్ యాదవ్ తెలిపారు. ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ సూచనలు, సలహాల మేరకు గ్రామ ప్రజలకు అవసరమైన సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. గతంలోనూ జొన్నగిరి గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తిన సమయంలో బోర్లు వేయించడంతో పాటు ట్యాంకర్ల ద్వారా ఉచితంగా నీటిని అందించినట్లు మిద్దె సోదరులు తెలిపారు. "ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వైపు మాత్రమే చూడకుండా.. మన గ్రామం కోసం మన వంతు బాధ్యతగా ముందుకు రావాలి. ప్రతి ఒక్కరూ తమకు తోచిన సహాయం చేస్తూ గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి" అని వారు పిలుపునిచ్చారు. ఎస్సీ కాలనీ ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని సొంత ఖర్చుతో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యపై స్పందించి వెంటనే పరిష్కారం చూపిన మిద్దె సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.

# క్రైస్తవు సోదరులకు అన్నివిధాలా అండగా ఉంటా

### చర్చికి రూ. 7.50 లక్షల సౌండ్ సిస్టం విరాళం

### మంత్రాలయం ఎంఎల్ఏ బాలనాగిరెడ్డి



**మంత్రాలయం, ఆగస్ట్ 8,మనం న్యూస్:** మంత్రాలయం నియోజకవర్గంలోని క్రైస్తవ సోదరులకు అన్ని విధాలా అండగా ఉంటానని ఎంఎల్ఏ వై. బాలనాగిరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని 52-బసాపురం గ్రామంలో ఉన్న లివింగ్ మినిస్ట్రీస్ చర్చికి యువనేత ధరణిరెడ్డి, ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో రూ. 7.50 లక్షల సౌండ్ సిస్టం ను విరాళం అందించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గం లోని క్రైస్తవ సోదరులకు మా దృష్టిలో ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. రాబోయే భవిష్యత్ లో సైతం క్రైస్తవు సోదరులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఎంఎల్ఏ హామీ ఇచ్చారు. ఈ సందర్భంలో చర్చి కి సౌండ్ సిస్టం విరాళం అందించినందుకు లివింగ్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ సామేలు అయ్యగారు ఎంఎల్ఏ కు, ధరణిరెడ్డి, ప్రదీప్ రెడ్డి వైసిపి మండల అధ్యక్షులు గుర్రెడ్డి భీంరెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కూటమి ప్రభుత్వం అందరికీ భరోసానిస్తోంది



**మంత్రాలయం , ఆగస్టు 8,మనం న్యూస్ ;-** కూటమి ప్రభుత్వం ప్రతి కుటుంబానికి భరోసా ఇస్తుందని మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ అన్నారు. శనివారం టిడిపి ఇంచార్జ్ ఎన్ రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు మండల పరిధిలోని చట్నీహళ్లి గ్రామంలో టిడిపి ఇంటింటికి ప్రచార కార్యక్రమం చేపట్టారు. ముందుగా టిడిపి ప్రకటించిన హామీల బుక్ లెట్ ను ఇస్తూ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆపదలో ఆదుకున్న 'తెలుగుదేశం' కుటుంబం


### ప్రాణాపాయ స్థితిలో జె.విజయ్‌కు వైద్య సాయం

### మానవత్వానికి నిదర్శనం టీడీపీ నరవ దంపంతులు

### టీడీపీ ఇంచార్జి యన్.రాఘువేంద రెడ్డి

### రూ.2.54, 129.. లక్షల ఎల్.ఓ.సీ. మంజూరు.. నరవ దంపతుల చేతుల మీదుగా లేఖ అందజేత







**పెద్దకడబూరు ఆగష్టు 08,ప్రభ మనం:** ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ నిరుపేద కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలిచింది.పెద్దకడబూరు మండల కేంద్రానికి చెందిన జె.విజయ్‌కుమార్ (35) తీవ్రమైన వాస్క్యులర్ వ్యాధితో గత తొమ్మిది నెలలుగా బాధపడుతున్నారు.అత్యవసరంగా శస్త్రచికిత్స చేయాల్సి ఉండగా ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉండటంతో టీడీపీ నాయకులు చొరవ తీసుకున్నారు.జగతప్ప విజయ్ పొట్ట భాగంలోని ప్రధాన రక్తనాళాలు పూర్తిగా మూసుకుపోవడంతో శరీరంలోని ముఖ్యమైన అవయవాలకు రక్తప్రసరణ సరిగా జరగడం లేదని వైద్యులు నిర్ధారించారు.ఆహారం తీసుకున్న ప్రతిసారీ తీవ్రమైన కడుపునొప్పి రావడంతో పాటు చేతులు,కాళ్లకు వాపు వస్తుండటంతో ప్రస్తుతం గంజి మాత్రమే తీసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కర్నూలు,హైదరాబాద్,బెంగళూరులోని పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించినా ఫలితం లేకపోవడంతో తమిళనాడులోని వెల్లూరు ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. వెంటనే వాస్క్యులర్ సర్జరీ చేయాలని, ఇందుకు సుమారు " లక్షలు""వరకు ఖర్చవుతుందని వైద్యులు సూచించారు. మీడియా కథనాలతో స్పందన విజయ్ దీనస్థితిపై ప్రింట్,ఎలక్ట్రానిక్ మీడియా,సోషల్ మీడియాలో కథనాలు రావడంతో విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి,టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ వెంటనే స్పందించారు.విషయాన్ని మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్. రాఘవేంద్ర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.జె.విజయ్‌కు అత్యవసర వైద్యం అవసరమని గుర్తించిన రాఘవేంద్ర రెడ్డి ముఖ్యమంత్రి కార్యాలయానికి ఎల్‌ఓసీ కోసం ప్రతిపాదనలు పంపించారు.స్పందించిన సీఎం కార్యాలయ అధికారులు రూ.2,54,129 ఎల్‌ఓసీని మంజూరు చేశారు.నిమ్స్‌లో సర్జరీకి ఏర్పాట్లు మంజూరైన ఎల్‌ఓసీ లేఖను శనివారం నరవ దంపతులు విజయ్ భార్య మారెమ్మకు అందజేశారు.జగతప్ప విజయ్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స కోసం చేర్పించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా విజయ్ భార్య మారెమ్మ మాట్లాడుతూ,తమ కుటుంబం ఆపదలో ఉన్న సమయంలో స్పందించి( ఎల్.ఓ.సీ.) మంజూరు చేయించేందుకు కృషి చేసిన టీడీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి,టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి నరవ శశిరేఖ,యన్.రాఘవేంద్ర రెడ్డితో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.విజయ్‌కు నిమ్స్‌లో జరగనున్న శస్త్రచికిత్స విజయవంతం కావాలని,ఆయన త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో స్వగ్రామానికి తిరిగి రావాలని శ్రీమతి నరవ శశిరేఖ ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సింగల్ విండో చైర్మన్ తలారి ఆంజనేయులు,డి.మల్లికార్జున కోసిగి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ బొగ్గుల తిక్కన్న కార్తికేయ,ఎం.రామన్న జె.హనుమంతు బి.సుధాకర్,బి.సందీప్.బి జైపాల్ డీలర్స్ ఎం. ఆదాము,బి.ఇమ్మానుయేలు,జి.ఆశీర్వాదం, బుడ్డన్న,టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పీఎండీఎస్ పంట సాగుపై రైతులకు అవగాహన

### మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు



**తుగ్గలి, ఆగస్టు 8 ( ప్రభ మనం,న్యూస్):** తుగ్గలి మండలంలోని జొన్నగిరి గ్రామంలో శివయ్యకు చెందిన మామిడి తోటలో శుక్రవారం పీఎండీఎస్ విత్తనాలు చల్లే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు రైతులకు పీఎండీఎస్ పంట సాగు, పంట నమోదు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతి రైతు పీఎండీఎస్ భూములను ఖాళీగా ఉంచకుండా విత్తనాలు చల్లుకొని పంట సాగు చేపట్టాలని సూచించారు. అలాగే పీఎండీఎస్ పంట నమోదు కార్యక్రమానికి ఆగస్టు 15వ తేదీ చివరి గడువు కావడంతో రైతులు ఎలాంటి ఆలస్యం చేయకుండా త్వరితగతిన పంట నమోదు చేసుకోవాలని కోరారు. తుగ్గలి మండల వ్యాప్తంగా సుమారు 65 ఎకరాల్లో పీఎండీఎస్ పంట సాగు జరుగుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి సురేష్ బాబు తెలిపారు. పంట నమోదు విషయంలో రైతులు వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటించి గడువులోగా నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ఆయన కోరారు.

# గిరిగెట్లలో ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు.. ప్రజలకు భద్రతపై అవగాహన




**తుగ్గలి, ఆగస్టు 8 ( ప్రభ మనం,న్యూస్):** తుగ్గలి పోలీస్ స్టేషన్ ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని గిరిగెట్ల గ్రామంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులకు, ప్రజలకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా చైన్ స్నాచింగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఘటనలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అలాగే ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా వచ్చే సమాచారంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మోసపూరిత కాల్స్‌కు స్పందించవద్దని తెలిపారు. రోడ్డు భద్రతలో భాగంగా వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని ఎస్సై నరేష్ సూచించారు. అదేవిధంగా సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఓటీపీ, పిన్ తదితర సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వెల్లడించవద్దని హెచ్చరించారు. మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా వెంటనే పోలీసులను సంప్రదించాలని ఎస్సై నరేష్ తెలిపారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే పోలీసుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఆదివారం 09-08-2026

# కాలం ముందుకీ వెనక్కీ


ఇన్ఫోగ్రాఫిక్





మానవాళి దైనందిన జీవితం అంతా సూర్య గమనం మీదే ఆధారపడి ఉంది. తూర్పు కనుమల్లో సూర్యుడు ఉదయించింది మొదలు పడమటి కోనలోకి జారుకునే వరకు మానవాళి జాగృతమై ఉంటుంది. అయితే సూర్యోదయం, అస్తమయం, రాత్రి, పగటి వేళలు ఒక్కోదేశంలో ఒక్కోరకంగా ఉంటాయి. ప్రాంతాలను బట్టి వీటిల్లో హెచ్చుతగ్గులు ఉంటాయి. సూర్యుడి శక్తిని సంపూర్ణంగా వినియోగించుకోవాలనే లక్ష్యంతో కొన్ని దేశాల్లో గడియారంలో కాలాన్ని ముందుకీ, వెనక్కీ మార్చేస్తుంటాయి. దాన్నే 'డే లైట్ సేవింగ్ టైమ్' అని పిలుస్తుంటారు. అమెరికాతోపాటు ప్రపంచవ్యాప్తంగా సుమారు 72 దేశాలు ఈ 'డే లైట్ సేవింగ్ టైమ్' విధానాన్ని అనుసరిస్తున్నాయి. ప్రతి సంవత్సరం వేసవిలో ఈ దేశాల వాళ్లు గంట ముందుంటారు. మళ్లీ శీతకాలం ప్రారంభంలో మళ్లీ యథాప్రకారం కాలాన్ని సెట్ చేసుకుంటారు. అమెరికాలో మార్చి నెల రెండో ఆదివారం అర్ధరాత్రి 1.59.59 గంటల తర్వాత రెండు గంటలు కాకుండా గడియారంలో సమయాన్ని 3 గంటలుగా మారుస్తారు. అలా ఒక గంట సమయాన్ని ముందుకు జరుపుతారు. మళ్లీ నవంబర్ మాసం మొదటి ఆదివారం 1.59.59 గంటల తర్వాత సమయాన్ని మళ్లీ ఒంటిగంటకు సెట్ చేస్తారు. డే లైట్ సేవింగ్ టైమ్ విధానాన్ని అనుసరిస్తున్న దేశాలన్నీ కాస్త అటూఇటూగా ఇదే నెలల్లో సమయాన్ని ముందుకీ, వెనక్కీ జరుపుతుంటాయి. గడియారాల్లో మాన్యువల్‌గా సమయాన్ని మారుస్తారు. కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్స్ లాంటి పరికరాల్లో టైమ్ ఆటోమేటిక్‌గా మారిపోతుంది. ప్రజలు పగటి సమయాన్ని, సూర్యకాంతిని విస్తృతంగా ఉపయోగించుకోవాలని ఆయాదేశాలు ఈ విధానాన్ని పాటిస్తున్నాయి. సాధారణంగా ఉద్యోగులు, కార్మికులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేస్తారు. వేసవిలో సమయాన్ని గంట ముందుకు జరపడం వల్ల ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల మధ్య పని చేసి తొందరగా ఇంటికి వెళ్తారు (గడియారం పరంగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు). సాయంత్రం ఇంకా వెలుగు ఉంటుంది కాబట్టి కుటుంబంతో బయటికి విహారానికి వెళ్తారు. తద్వారా ఇండ్లలో విద్యుత్ వినియోగం తగ్గుతుంది. అలాగే సాయంత్రం వేళ విహారానికి వెళ్లే కుటుంబాల వల్ల మార్కెట్‌లో కొనుగోళ్లు పెరుగుతాయి. అలా ఆర్థిక వ్యవస్థ కూడా మెరుగవుతుంది. ఈ ఉద్దేశంతోనే పలు దేశాలు ఈ విధానాన్ని అమలు చేస్తున్నాయి. 1895 సంవత్సరంలో జార్జ్ హడ్సన్ అనే శాస్త్రవేత్త ఈ విధానాన్ని ప్రతిపాదించాడు. వేటకు వెళ్లడం ఆయన అభిరుచి. ల్యాబ్‌లో పనిముగిసే సమయానికి చీకటి పడుతుండటం ఆయనకు విసుగు తెప్పించింది. దీంతో గడియారంలో సమయాన్ని ఓ గంట ముందుకు జరిపితే.. సాయంత్రం పెందరాలే పని ముగించుకొని వెలుతురు ఉన్నప్పుడే వేటకు వెళ్లొచ్చని భావించాడట. అలా 'డే లైట్ సేవింగ్ టైమ్'కు శ్రీకారం చుట్టాడు. 1784 ప్రాంతంలో అమెరికాకు చెందిన శాస్త్రవేత్త, రాజకీయ నాయకుడు 'డే లైట్ సేవింగ్ టైమ్'ను ప్రతిపాదించాడని కొందరు చెబుతారు. 'డే లైట్ సేవింగ్ టైమ్' విధానాన్ని తొలిగా అమలుపరిచిన దేశం జర్మనీ అని చెబుతారు. 1916లో మొదటిసారి ఈ సమయ మార్పులను అమలుచేసింది. తర్వాత ఆస్ట్రియా, అమెరికా, యూరప్ దేశాలు కూడా ఈ పాలసీని పాటించడం మొదలుపెట్టాయి. ఇప్పటికీ మార్చి, నవంబర్ నెలల్లో టైమ్ అడ్జస్ట్‌మెంట్ చేస్తున్నాయి. ఇండియా సహా ఆసియా, ఆఫ్రికా దేశాలేవీ దీన్ని పాటించడం లేదు. అమెరికాలోని ఆరిజోనా, హవాయి రాష్ట్రాలు కూడా ఈ 'డే లైట్ సేవింగ్ టైమ్'ను పాటించడం లేదు.

# ఆక్స్‌ఫర్డ్ హెచ్చరిక బ్రెయిన్ రాట్



అలా ఫోన్ చూస్తూ కూర్చుంటే మెదడు పుచ్చిపోతుంది అనే తిట్లు ప్రతి ఇంట్లో వినిపిస్తూనే ఉంటాయి. ఫోన్ ఎక్కువ సేపు చూస్తున్నావంటూ పెద్దలు.. పిల్లల్ని తిట్టినప్పుడల్లా 'హోంవర్క్ కోసం' అని వాళ్లు సర్దిచెప్పే ప్రయత్నం చేయడం కామన్. 'నువ్వు కూడా ఫోన్ చూస్తున్నావ'ని పిల్లలు పెద్దల్ని నిలదీసినప్పుడు 'అది ఆఫీసు పని మీద అని మభ్యపుచ్చడమూ' చూస్తున్నాం! ఒక్క మాట మాత్రం వాస్తవం. లోకం అంతా ఇప్పుడు ఫోన్ అనే వ్యసనంతోనే జీవిస్తున్నది. డేటా చవకగా మారిపోవడంతో ఆ వ్యసనం నానాటికీ విస్తరిస్తున్నది. ఇంతకీ ఈ తెలిసిన విషయాన్నే మళ్లీ గుర్తుచేసుకోవడానికి ఓ కారణం ఉంది. ఆంగ్ల నిఘంటువుల్లో తలమానికం అయినా ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాన్ని సూచించే 'బ్రెయిన్ రాట్' అనే పదాన్ని 'వర్డ్ ఆఫ్ ది ఇయర్'గా ప్రకటించింది.

**ఏమిటీ వర్డ్ ఆఫ్ ది ఇయర్?**

నిఘంటు నిర్మాణంలోనో, భాష చుట్టూ అల్లుకునో పనిచేసే చాలా సంస్థలు ఏటా ఒక ముఖ్యమైన పదాన్ని 'వర్డ్ ఆఫ్ ది ఇయర్'గా ప్రకటిస్తుంటాయి. దాదాపు 50 ఏళ్ల క్రితం మొదలైన ఆనవాయితీ ఇది. కేంబ్రిడ్జ్, కొలిన్స్, వెబ్‌స్టర్‌లతోపాటుగా ఆక్స్‌ఫర్డ్ కూడా ఏటా ఈ ప్రక్రియ చేపడుతుంది. గత ఏడాదిలో ఆ పదాన్ని ఉపయోగించిన తీరు, భావప్రకటన సంస్కృతులను అది ప్రతిబింబించిన విధానం ఆధారంగా ఈ పదాన్ని నిర్ణయిస్తారు. ఆక్స్‌ఫర్డ్ కోసం నిష్ణాతులైన సంపాదకులు, భాషా నిపుణులు ఉన్నప్పటికీ వేల మంది పాఠకుల నుంచి వచ్చిన ఓటింగ్ ఆధారంగానే ఈ పదాన్ని నిర్ణయిస్తారు. డెమ్యూర్, డైనమిక్ ప్రైసింగ్, స్లాప్, లోర్ లాంటి ఎన్నో పదాలను దాటుకుని 'వర్డ్ ఆఫ్ ది ఇయర్ కిరీటాన్ని' అందుకుంది బ్రెయిన్ రాట్. 2000 సంవత్సరం తర్వాత పెరుగుతున్న ఇంటర్నెట్ వాడకానికి దీన్ని అన్వయించడం మొదలుపెట్టారు. 2023తో పోలిస్తే గత ఏడాది ఈ పదం వాడకం 230 శాతం పెరగడం గమనించారు. దీన్ని కేవలం ఓ నిందగానే కాకుండా, సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలను సూచించడానికి కూడా వాడటం మొదలుపెట్టారు. అందుకే ఈ పదం వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా నిలిచింది.


# హెల్మెట్.. సీట్‌బెల్ట్ తప్పనిసరి: పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్ గౌడ్

రోడ్డు భద్రతపై వాహనదారులకు పత్తికొండ రూరల్ పోలీసుల అవగాహన



**తుగ్గలి,ఆగస్టు 8 ( ప్రభ మనం,న్యూస్):** రహదారి భద్రతపై వాహనదారుల్లో అవగాహన కల్పించేందుకు పత్తికొండ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాతన గ్రామంలో లోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,నాలుగు చక్రాల వాహనదారులు సీట్‌బెల్ట్ వినియోగించాలని పోలీసులు సూచించారు. రోడ్డు ప్రమాదాలు సంభవించిన సమయంలో హెల్మెట్, సీట్‌బెల్ట్ ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయని వాహనదారులకు వివరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను క్రమం తప్పకుండా పాటిస్తూ తమతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడాలని సూచించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే సమయంలో సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల తీవ్రతను తగ్గించవచ్చని పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పతనావస్థకు బీజం



ఇందిరాగాంధీ తర్వాత కాంగ్రెస్‌కు 'బ్రహ్మాస్త్రం'గా ఆ పార్టీ నేతలు, మీడియా అభివర్ణించిన ఎంపీ ప్రియాంకాగాంధీ వాద్రా పార్లమెంట్‌లో శుక్రవారం చేసిన తొలి ప్రసంగం తుస్సుమంది. వయనాడ్ ఉప ఎన్నికలో గెలిచాక ఆమెపై కాంగ్రెస్ నేతలు భారీగా అంచనాలు పెట్టుకున్నారు. కానీ, ఆమె ప్రసంగంలో కొత్తదనం గాని, దూకుడు గాని ఎక్కడా కనిపించలేదు. కాంగ్రెస్ సభ్యుల హర్షధ్వానాలు మినహా పెద్దగా చెప్పుకోవడానికి గట్టి పాయింట్ ఏదీ కనిపించలేదు. రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏండ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన చర్చను ప్రతిపక్షాల తరపున తొలిసారి ఎంపీగా గెలిచిన ప్రియాంకతో ప్రారంభించడమే కాంగ్రెస్ వైఖరి మారదని చెప్పేందుకు నిదర్శనం. అదే రోజు ఉదయం టాలీవుడ్ హీరో అల్లు అర్జున్‌ను రాష్ట్ర పోలీసులు అరెస్టు చేయడంతో ప్రియాంక ప్రసంగం మరుగున పడిపోయింది. సహజంగానే 'పుష్ప' నిర్బంధం, కోర్టు, ఆస్పత్రికి తరలింపు దృశ్యాలు ప్రేక్షకులను ఎక్కువగా ఆకట్టుకున్నాయి. 2004లో తొలిసారి లోక్‌సభకు ఎన్నికైన రాహుల్.. టైమ్స్ ఆఫ్ ఇండియా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'ప్రధాని కుర్చీ ఎక్కడం పెద్ద విషయం కాదు' అని అహంభావంతో సమాధానమిచ్చారు. తమ కుటుంబంలోని ముగ్గురు సభ్యులు ప్రధాని పీఠం ఎక్కి ఉండవచ్చు. అంతమాత్రాన తొలిసారి ఎంపీగా ఎన్నికైన వ్యక్తి అలా మాట్లాడటం దిగ్భ్రాంతికరం. నెహ్రూ-గాంధీ కుటుంబం మాత్రమే త్యాగాలు చేసినట్టు, దేశ ప్రజలకు వారే శిరోధార్యం అన్నట్టుగా వారు మాట్లాడటం సబబు కాదు. అయినా బయటివారు ప్రశంసించాలే గాని, ఆ కుటుంబ సభ్యులే స్వోత్కర్షతో మాట్లాడితే వారు నడిపే రాజకీయపక్షానికే నష్టం. తన తొలి ప్రసంగంలో నెహ్రూ, ఇందిర దేశానికి ఎంత మేలు చేశారనే విషయానికే ప్రియాంక ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. దేశంలో అనేక కీలక సంస్థలకు నెహ్రూ పునాదులు వేశారని చెప్పారు. అయితే, ఈ సంస్థలన్నీ స్వాతంత్ర్యం వచ్చాక జాతి లేదా దేశ నిర్మాణంలో భాగంగా అన్ని ప్రభుత్వ వ్యవస్థల సమష్టి కృషితో రూపుదిద్దుకున్నాయి. నెహ్రూ వంటి గొప్ప నేత స్మృతికి దీని వల్ల నష్టమే తప్ప మేలు జరగదు. ఇంకా చెప్పాలంటే ఈ ప్రచారమే దివంగత నేతలపై వ్యతిరేకతను పెంచుతున్నది. దాదాపు 17 ఏండ్లు ప్రధానిగా కొనసాగిన నెహ్రూ వంటి బడా నేతల విషయంలో భిన్నాభిప్రాయాలు ఉండటం సహజం. అందరూ తమ ముత్తాత ఘనతను తన మాదిరిగా గుర్తించాలని, కీర్తించాలని ప్రియాంక కోరితే అది జరగదు. సోనియా అయినా తన జీవితానుభవం నుంచి ఈ విషయం గురించి కూతురికి చెప్పాలి. 2004లో యూపీఏ సర్కారు అధికారం చేపట్టినప్పుడు ప్రియాంక మెట్టిన కుటుంబం తమ ఇంటిపేరు 'వధేరా'ను 'వాద్రా' గా మార్చుకుంది. అప్పట్లో ఒక ప్రభుత్వ కార్యక్రమానికి ప్రియాంక కుటుంబానికి పంపిన అధికార ఆహ్వాన పత్రికలో ఆమె పేరును ప్రియాంకాగాంధీ వధేరా అని రాశారు. అం దుకు ఒక అధికారిని బాధ్యుడిని చేస్తూ అతనికి కేంద్రం నోటీసు జారీచేసింది. ఈ వార్త మీడియాలో హల్‌చల్ చేయడంతో వెంటనే దాన్ని వాపసు తీసుకున్నది. ఈ ఘటన ప్రియాంక దూకుడు వ్యవహారశైలికి తార్కా ణం. ఈ 20 ఏండ్లలో ప్రియాంక, రాహుల్ ఇంకా నేల మీద నడవకుండా అదే ధోరణిలో వ్యవహరించడం ఆ కుటుంబ దీనావస్థను గాక వారు సారథ్యం వహించే కాంగ్రెస్ పతనావస్థకు అద్దం పడుతున్నది. గతవారం లోక్‌సభలో అరగంట పాటు సాగిన ప్రియాంక ప్రసంగం కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం నింపలేకపోయింది. ఆమె నాయనమ్మ ఇందిర ప్రధాని పదవి చేపట్టిన మొదట్లో మాట్లాడేందుకు ఇబ్బంది పడ్డారు. అందుకే సోషలిస్టు దిగ్గజం రామ్ మనోహర్ లోహియా ఆమెను తరచూ 'గూంగీ గుడియా' (మూగబొమ్మ) అని అభివర్ణించేవారు. కాలక్రమంలో ఇందిర గంభీరంగా, పద్ధతిగా మాట్లాడటం అలవర్చుకున్నారు. మాజీ ప్రధానులు చంద్రశేఖర్, పీవీ నరసింహారావు, వాజపేయి వంటి గొప్ప వక్త కాకున్నా పార్లమెంటులో ఇందిర బాగానే నెట్టుకురాగలిగారు. ప్రియాంక తన వాగ్ధాటితో జాతిని ఉర్రూతలూగిస్తారని ఎవరూ ఆశించలేదు. కానీ, మరీ పాత రికార్డు వేసినట్టు మాట్లాడతారని కాంగ్రెస్ నేతలే ఊహించలేదు. సోమవారం నాడు ప్రియాంక పార్లమెంటుకు వెళ్లినప్పుడు ఆమె భుజంపై నుంచి వేలాడుతూ ఉన్న అందమైన సంచిపై ఆంగ్లంలో 'పాలస్తీనా' అని రాసి ఉన్న అక్షరాలు కనిపించాయి. పెద్దగా శ్రమ లేకుండా పేరు సంపాదించాలనే ఆమె ధోరణిని అవి సూచిస్తున్నాయి. కష్టపడకుండా రాజకీయాల్లో ఎదగడం కష్టమనే వాస్తవాన్ని ప్రియాంకకు కాంగ్రెస్ సీనియర్లు చెప్తే మంచిది. లోక్‌సభలో తొలి ప్రసంగంతోనే ఆమె రాజకీయ సత్తా ఏంటో అంచనా వేయడం న్యాయం కాదు. కానీ, 1998లో రాయ్‌బరేలీ స్థానంలో ప్రచారంతో ప్రియాంక రాజకీయ జీవితం ప్రారంభమైందనేది వాస్తవం. ఇప్పటికే ఆమె ఐదు దశాబ్దాల జీవన ప్రయాణాన్ని దాటారు. ఈ విషయాన్ని గుర్తిస్తే కాంగ్రెస్‌కే కాదు, భారత ప్రజాస్వామ్య వ్యవస్థకూ మేలు జరుగుతుంది.

# జమిలి ఎన్నికలు

సార్వత్రిక ఎన్నికల్లో సంపూర్ణ మెజారిటీ రాకపోవడంతో బీజేపీ ఈసారి 'ఒకే దేశం ఒకే ఎన్నిక' వంటి క్లిష్టమైన కార్యాలను తలకెత్తుకోదని అనుకున్నారు. సంకీర్ణ సర్కారు ఏర్పాటు చేయాల్సిరావడమే అందుకు కారణం. అయితే, ఈ అంచనాలను పటాపంచలు చేస్తూ ప్రధాని మోదీ గత ఆగస్టు 15 నాటి ప్రసంగంలో ఏకకాల ఎన్నికల గురించి ప్రస్తావించారు. అంతులేని ఎన్నికల చక్రభ్రమణంలో నుంచి దేశాన్ని బయటపడేయాల్సి ఉందని నొక్కిచెప్పారు. అన్నట్టే బిల్లులను సిద్ధం చేసి ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడం, సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) పరిశీలనకు పంపడం చకచక జరిగిపోయాయి. అయితే, నాలుగు చట్ట సవరణలు, 18 రాజ్యాంగ సవరణలు చేస్తే గానీ జమిలి ఎన్నికలు సాధ్యం కావనే విషయం గమనార్హం. మాజీ రాష్ట్రపతి కోవింద్ అధ్యక్షతన ఏర్పాటైన కమిటీ, గత మార్చిలో సమర్పించిన నివేదికలో 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' భావనను బలంగా సమర్థించింది. ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల పాలనాపరమైన సుస్థిరత, విధానపరమైన స్పష్టత ఏర్పడి దేశానికి మేలు కలుగుతుందని ఆ కమిటీ అభిప్రాయపడింది. ఈ ప్రక్రియ ఓటర్లకు సౌకర్యంగా ఉంటుందని, అనవసరమైన హైరానా తప్పుతుందని, అధిక ఓటింగ్ నమోదుకు అవకాశం ఉంటుందని, దేశంపై ఎన్నికల నిర్వహణ వ్యయభారం కూడా తగ్గుతుందని ఆ కమిటీ సూచించింది. పార్లమెంటుకు, అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు జరపాలని, అదేవిధంగా 100 రోజులలోపు స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని సిఫారసు చేసింది. సూత్రప్రాయంగా అనేక పార్టీలు ఈ మార్పులకు అనుకూలమే అయినప్పటికీ అవి జరిగే తీరుతెన్నులపైనే అనేక అనుమానాలున్నాయి. వాటి నివృత్తికి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి. బిల్లులు ఓటింగ్‌కు వచ్చేది బడ్జెట్ సమావేశాల్లోనే కనుక దేశంలోని అన్ని వర్గాల అభిప్రాయాలను రాబట్టాలి. పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల అనుసంధానం ఎప్పుడు, ఎలా జరుగుతుందనే విషయంలో స్పష్టత రావాలి. అందుకు దేశవ్యాప్తంగా లోతైన చర్చ జరగాలి. నిజానికి ఏక కాల ఎన్నికల విషయమై దేశంలో ఏకాభిప్రాయం లే దు. దీన్ని సమర్థించేవారు ఉన్నట్టుగానే వ్యతిరేకించేవారు కూడా బహుళ సంఖ్యలో ఉన్నారు. ఎన్నికల వ్యయం తగ్గడం మొదలుకొని ప్రభుత్వ పరిపాలనా సౌలభ్యం దాకా పలు కారణాలను దీని సమర్థకులు చూపిస్తుంటారు. ప్రాంతీయ




అస్తిత్వాలు, ఆకాంక్షలు వెనుకతట్టు పడతాయని, సమాఖ్యవాదానికి ముప్పు ఏర్పడుతుందని, లోక్‌సభతో పాటు అసెంబ్లీలకూ ఎన్నికలు జరిపితే జాతీయవాద ఎజెండా ముందుకువచ్చి రాష్ట్రాల ప్రాధాన్యాలు నిర్ణయాత్మకం కాకుండా పోతాయనేవి వ్యతిరేకుల ప్రధాన అభ్యంతరాలు. ఈ నేపథ్యంలో జమిలి వంటి సుదూర పర్యవసానాలు కలిగిన మార్పుల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆచితూచి అడుగువేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

**ముందు ఈసీకి ఎన్నికలు పెట్టండి**

'ఒకే దేశం- ఒకే ఎన్నిక' సంగతి తర్వాత గానీ, ముందు ఎలక్షన్ కమిషన్‌కు ఎన్నికలు నిర్వహించండి. రాష్ట్రపతిని ఎన్నికల ద్వారా నియమిస్తున్నప్పుడు ఎన్నికల కమిషనర్లను ఎందుకు ఎన్నుకోకూడదు?

# ఈ ఎలుకలు డ్యామ్ కట్టేస్తాయి!



ఇదిగో ఇక్కడ కనిపిస్తుందే ఆ డ్యామ్ కట్టేసరికి తలప్రాణం తోకకి వచ్చిందనుకో అన్నది తోకను నిమురుకుంటూ ఓ పెద్ద ఎలుక. ముఖ్యంగా పిల్లర్ల కోసం ఆ పెద్ద దుంగలు నరికే సరికి.. సారీ కొరికే సరికి దుంప తెగిందనుకో అంది మరో మధ్య వయసు నారింజ పండ్ల ఎలుక. ఏదేమైనా అందరం కట్టగట్టుకొని ఆనకట్ట కట్టడం భలే ఆనందం అబ్బా ఇంక మన ఇండ్లకు ఏ కాలమైనా సమస్యే లేదు అంది ఓ చిట్టి ఎలుక. ఇదేం కార్టూన్ సినిమా కథ కాదండీ. నిజంగానే ఈ ఎలుకలు సమష్టిగా పనిచేసి నదుల దగ్గర డ్యామ్‌లు కడతాయి. జీవావరణ ఇంజినీర్లుగా వీటికి పేరుంది. ఇంతకీ ఇవి ఎందుకిలా చేస్తాయో ఇక్కడి చిత్రాల్లో కనిపిస్తున్న ఎలుకలను బీవర్‌లుగా పిలుస్తారు. అమెరికాతో పాటు, యురేషియా ప్రాంతంలో అంటే ఉత్తరార్ధగోళంలో ఎక్కువగా నివసించే వీటి నైపుణ్యాలు అచ్చెరువొందిస్తాయి. పారే నదులు, నదీ పాయలు, సెలయేళ్లలో ఇవి నివసిస్తాయి. డోమ్‌ల ఆకృతిలో ఉండే వీటి ఇండ్లను నిర్మించుకోవడం కోసం తామే ఆ ధారలో ఓ చోట మడుగులను ఏర్పాటు చేసుకొంటాయి. అందుకోసం నదీ ప్రవాహ వేగాన్ని తగ్గించేందుకు ముందుగా నీటి ప్రవాహం అంచున ఉన్న పెద్దచెట్లను తన బలమైన నారింజ రంగు పండ్లతో కొరికి నేల కూలుస్తాయి. ఇవి తమ పళ్లతో 148 అడుగుల ఎత్తు, 45 అంగుళాల చుట్టుకొలత కలిగిన పెద్ద చెట్లను సైతం పడేసినట్టు రికార్డులున్నాయి. వీటి పళ్లలో ఇనుము ఎక్కువగా ఉండటం వల్ల వీటికా రంగు వస్తుందట. ఆ తర్వాత అన్నీ కలిసి ఆ దుంగలను నీటి ప్రవాహం వైపు నెట్టుకొస్తాయి. దుంగలు నిలబడటానికి తమ రెండు చేతులతో గుండ్రాళ్లు, మట్టిని పోగుచేసి ఒక దగ్గరికి తెస్తాయి. అవన్నీ కుదురుకుని నీటి ప్రవాహం నెమ్మదించాక చెట్ల కొమ్మలు, గులక రాళ్లు, ఇసుక, పుల్లలు, గడ్డి ఇలా అన్నింటినీ వేస్తూ ఒక ఆనకట్టను నిర్మిస్తాయి. దీంతో ఆ భాగం ఇండ్లు కట్టుకోవడానికి అనుకూలంగా మారుతుంది. ఇందులో పుల్లలు, రాళ్లు ఏరుకొచ్చి బోర్లించిన గూడులా తమ ఇండ్లను కట్టుకుంటాయి. తినడానికి, ఉండటానికి, చలికాలం ఆహారం నిల్వ చేసుకునేందుకు వీలుగా విడివిడి భాగాలుగా నిర్మించుకుంటాయి. వీటి ద్వారాలు మాత్రం నీటిలోపలి నుంచి వెళ్లగలిగేలా మాత్రమే ఉంటాయి. అంటే నేల మీది వీటి శత్రువుల నుంచి తప్పించుకోవడానికన్నమాట. ఇక, ఇలా ఆనకట్ట కట్టి నీటి కొలను ఏర్పరచుకోవడం వల్ల నీటి మట్టం నియంత్రణలో ఉంటుంది. దాంతో గడ్డకట్టే చలిలోనూ అడుగున నీరు ఉండి వీటి రాకపోకలకు ఇబ్బంది ఉండదు. ఇవి ఇలా ఆనకట్ట కట్టడం వల్ల ఆ ప్రాంతంలో చేపలు, కప్పలు, పురుగులతో చక్కటి జీవావరణ వ్యవస్థ కూడా ఏర్పడుతుందట. చలికాలం ముందు డ్యామ్ మెయింటెనెన్స్ పనులను చేసుకుంటాయట బీవర్లు. ప్రకృతిలో ఎన్ని వింతలో కదూ!